# ఎదిగే ఎదగని మనిషి



విజయా రఘురామ్

"ఎస్, కమిన్!" ఆ గొంతు వీణ తీగెలు మీటినట్లు, ఎలకోకిల గొంతు సవరించుకున్నట్లు లేదు. టైప్ మెషిన్ టకటక మంటున్నట్లు, కారు గేర్లు మార్చినట్లు ఉంది.

నాగస్వరం విన్న నాగుపాములా కాక, మీట నొక్కిన మెషిన్‌లా లోపలికి వచ్చాడతను.

ఆ రూము సెమినార్ హాలంత విశాలంగా ఉంది. ఎయిర్‌కూలర్ నుంచి వస్తున్న గాలి మంచుకొండల మీంచి వచ్చే మలయపవనంలా ఉంది.

లోపల జరిగే బిజినెస్ తప్పించి, మిగతా బయటి ప్రపంచపు రాగద్వేషాల నుంచీ, సుఖదుఃఖాలనుంచీ ప్రూఫ్ చెయ్యబడినట్లు కనిపిస్తున్నా, ఆ గది సౌండ్ ప్రూఫ్ చెయ్యబడలేదు.

ఆ గదిలో ఉన్న ప్రతి వస్తువు మీద ఇండియన్ స్టాండర్డ్స్ ఇన్‌స్టిట్యూట్ స్టాంపు ఉందో, లేదో చెప్పలేం కాని, కుబేరుడి ముద్ర మాత్రం ఉందని నిస్సందేహంగా చెప్పవచ్చు.

ఆ గదిలో ఉన్న పేముకుర్చీలు పూల సెజ్జల్లా కనపడుతూ ఉన్న, వాటి మీద కేవలం ఫోము మాత్రమే వేయబడి ఉంది. వాటి మీద మందు కొట్టిన మహా సర్పాల్లా కూర్చున్న వాళ్ళు బద్ధకంగాక, ఒద్దికగానే కూర్చున్నట్లు కనపడుతున్నారు.

వాళ్ళ మొహాల్లో ఐశ్వర్యం అందంగాను, అందం దయలాగాను, ఆ దయ ఎవ్వరూ భరించలేనిదిగాను, వాళ్ల అధికారం అందరూ భరించదగినదిగాను కనపడుతున్నాయి.

వాళ్ళ మధ్య ఆవిడ ఎక్స్‌ట్రాల మధ్య హీరోయిన్‌లా కాక, షేర్‌హోల్డర్ల మధ్య మేనేజింగ్ డైరెక్టర్‌లాగానే ఉంది. అంతే కాక, ఆవిడ దేవుడి ముందు వెలిగించిన దీపంలా స్వచ్ఛంగా, స్వేచ్ఛగా కాంతులు విరజిమ్ముతూనూ, అగరువత్తుల్లా సువాసనలు వెదజల్లుతూనూ ఉంది.

"ప్లీజ్ బి సీటెడ్!" ఆవిడ గొంతులో వినయం లేదు. అధికారం లేదు. కేవలం మర్యాద మాత్రం ఉంది.

వాళ్ల ముందు అతను కసాయి వాళ్ల ముందు మేకలా కాక, తన ఎక్స్‌‌‌–రే ఎగ్జామిన్ చేసే స్పెషలిస్టుల ముందు పేషెంట్‌లా కూర్చున్నాడు.

కాని, అతను పేషెంట్ కాదు. ఇంటర్వ్యూ కాండిడేటు.

అతని గెడ్డం ప్రొద్దున్నే గీసింది.

అతని బట్టలు నిన్ననే ఉతికినవి.

అతని చేతిలో ఫైలు కొత్తది. కాని, అందులోని సర్టిఫికేట్లు పద్నాల్గు పాతవి.

అతని వయస్సు ముప్ఫై అయిదులా కనిపిస్తున్నా, ముప్ఫైయే ఉంటుంది.

"మీ పేరు?"

'జ్ఞాపకాల తెరల వెనక మాట అటుంచి, అప్లికేషన్ ఫారమ్ మీదనుంచి కూడా నా పేరు అదృశ్యమైపోయిందా?'

"ఈ జాబ్ మీ కవసరమా?"

'తన కళ్లలో ఆశ, అంతకు మించిన అవసరం ఆమెకు కనిపించటం లేదా? లేక అసలు తన కళ్లలోకే తొంగి చూడటం లేదా?'

"మిమ్మల్నే ఎందుకు ప్రిఫర్ చెయ్యాలో చెప్పగలరా?"

'చెప్పగలను. చెప్పగలను. కాని, ఇంత మందిలో కాదు.'

"మీరు మేరీడ్ కదూ? పిల్లలెంత మంది?"

'వెడ్డింగ్ బెల్సులో తన మేరేజ్ ఫోటో పడకపోయినా తెలిసిపోయిందన్న మాట. ఫామిలీ ప్లానింగ్ పరిమితిలో ఉండకపోవడం డిస్‌క్వాలిఫికేషనా?'

"మీ మిసెస్ ఏం చేస్తున్నారు?"

తను కూర్చున్న కుషన్ ఛెయిర్ కుషన్ ఛెయిర్‌లా కాక, కరెంట్ ఛెయిర్‌లా అనిపించింది అతనికి.

ఈ ప్రశ్నకి అతను జవాబు చెప్పక పోయినా, ఇంతకి ముందు అడిగిన ప్రశ్నలకి, తరవాత అడిగిన ప్రశ్నలకి కేవలం ఇంటర్వ్యూలా చెప్పవలసిన జవాబులే చెబుతున్నాడతను.

అతను తన మనసులో మాట అత్యవసర పరిస్థితుల్లో కాని పైకి చెప్పడు.

"మీరు వెళ్లవచ్చు. ఏ సంగతీ తరవాత కమ్యూనికేట్ చేస్తాం" అన్న మాటలు ఆవిడ నోటినుండి బయటి కొచ్చినంత వేగంగా ఆ రూములోంచి బయటి కొచ్చాడతను.

ఇదేనా ఇంటర్వ్యూ? ఇంతేనా ఇంటర్వ్యూ? అనుకుంటూ తన పెర్‌ఫారమెన్స్ కన్నా, ఆవిడ రియాక్షన్స్ బేరీజు వేసుకుంటూ ఫైవ్ స్టార్ హోటల్‌లా ఉన్న ఆ ఆఫీసు బిల్డింగ్ లోంచి బయటి కొస్తున్న అతని చేతిలో

ఓ కవరు పెట్టబడింది.

ఎవరో అతను చూడలేదు.

గులాబీ రంగు కవరులో లేత రంగు కాగితం మీద నల్లని కుదురైన అక్షరాల్లో "సాయంత్రం ఆరు గంటలకి 'క్వాలిటీ'లో కలుసుకోండి. మాట్లాడాలి. మీ పేర టేబిల్ రిజర్వు చెయ్యబడి ఉంటుంది — లత" అని ఉంది.

ఆ లైన్ను తను కోరుకున్న గమ్యానికి దారుల్లాగ, జరిగిన కాలం కలకాక, నిజమే అవడానికి నిదర్శనం లాగా కనిపించాయి అతనికి.

సాయంత్రం. ఆ సాయంత్రం కాదు. ఎప్పుడో...అప్పుడెప్పుడో...కాని, పదేళ్ల వెనక ఓ సాయంత్రం...

మెడికల్ కాలేజీ గర్ల్స్ హాస్టల్ వెనక, సత్యనారాయణస్వామి గుడి వెనక, కంటికి కనిపిస్తున్న టౌన్ డిస్పెన్సరీ వెనక, పొలమంత దూరంగా ఆంధ్రప్రదేశ్‌లో రెండు ప్రదేశాలకు చెందినవాళ్లిద్దరూ కూర్చున్నారు.

మగా, ఆడా.

రాజా, లతా.

వాళ్ల పరిచయం రెండేళ్ల వయసుది.

ఆంధ్ర యూనివర్సిటీలో వాళ్ల సహవిద్యార్థిత్వం కూడా రెండేళ్లదే. కాని, వాళ్లిద్దరూ జీవితాంతంవరకూ సహజీవనం చేద్దామని నిశ్చయించుకొని ఏడాదే అయింది.

వాళ్ళు మీరు, మీరు అని గౌరవించుకోవడం మానేసి, నువ్వు, నువ్వని ఏకాంతంలో అభిమానాన్ని వ్యక్తపరుచుకోవడం ప్రారంభించి ఆర్నెళ్ళు అయింది.

ఆ ఆర్నెళ్లలో ఫైనలియర్ పరీక్షకు చదవడమే కాకుండా, ఒకళ్ళ మనసు ఇంకొకరు తడబడకుండా చదవగలమని, అభిరుచులు కలగలుపుకుని ఆనందించగలమని అనుకున్నారు.

వాళ్ల పరీక్షా ఫలితాలు తెలిసి ఓ వారం రోజులే అయింది.

వాళ్ళ మార్కుల లిస్టులు తీసుకొని కొన్ని గంటలే అయింది.

వాళ్లక్కడ కూర్చుని కొన్ని నిమిషాలే అయింది.

"మీ నాన్నగారి అభిప్రాయం తెలుసుకున్నావా, లతా?"

"ఊఁ." ఆ గొంతులో ఉత్సాహం ఏమీ ధ్వనించలేదు. విషణ్ణత ఉంది.

అతను నిరుత్సాహపడలేదు.

ఆ సమాధానం వాళ్లిద్దరూ అనుకుంటున్నదే.

చాలా మంది ప్రేమికులకు ఇంతకుముందు ఎదురైనదే. ఇకముందుకూడా ఎదురయ్యేదే.



'ఓ బొజ్జ గణపయ్య'
ఫోటో—కె. ఆర్. ఎమ్. ప్రకాశరావు (హిందూపూర్)

జీవితం రైలుబండిలో మొదటి తరగతి టిక్కెట్టు రిజర్వు చేయబడి ఉంది ఆమెకు.

అతను మూడవ తరగతి కంపార్టుమెంటు ఆఖరు మెట్టుపై ఉన్నవాడు.

నీరెండ కాంతిలో లత మొహం ముద్ద మందారంలా ఉంది. కళ్లలో మెరుపుకి బదులు ఎర్ర జీర లున్నాయి. కాని, ఆమె ఏ విషయం గురించి, ఏ పరిస్థితిలోను, ఏడిచే అంత బలహీనురాలు కాదని అతనికి తెలుసు.

అయినా ఎందుకో ధైర్యం చెబుదామనుకున్నాడు.

"డోన్ట్ వర్రీ, లతా! మన అదృష్టం వల్ల రిజల్ట్సు బాగానే ఉన్నాయి. మనమేం ప్రేమగాలి పీలుస్తూ ప్రబతక్కరలేదు. త్వరలో నా కెక్కడయినా జాబ్ దొరక్కపోదు. నిన్ను కరెన్సీ నోట్లమీద నడిపించలేకపోయినా, కష్టాలకు గురి చెయ్యనని హామీ ఇవ్వగలను" అన్నాడు. నేను మగవాణ్ణి అనే భావం వినిపించింది అతని గొంతులో.

నవ్వింది లత. అభిమానంగా అతని వంక చూస్తూ, "దట్స్‌రైట్, రాజా! నేను మాంతితో మాట్లాడాను. తప్పక హెల్ప్ చేస్తానంది. తెలుసుగా—వాళ్ళ నాన్నగారు మహానగరం కాలేజీ కమిటీ ప్రెసిడెంటు? సమ్మర్ హాలిడేస్ అయిపోగానే నేను జాబులో జాయినవచ్చు, బహుశా నీకైనా అవకాశముంటే నన్ను ముందే" అంది లత.

క్రిందనున్న టౌన్‌లో ఎవరో ముందు నుంచి పిలుస్తున్నట్లు, ఎవరో వెనకనుంచి తోస్తున్నట్లు పరుగెడుతున్న జన సందోహాన్ని చూస్తున్న రాజా ఉలిక్కిపడి, "ఏమన్నావు, లతా?" అన్నాడు అదుర్దాగా.

లత రిపీట్ చేసింది.

"సారీ, లతా! టు బి ఫ్రాంక్—నువ్విది ప్రేమే అనుకో, మూర్ఖత్వమే అనుకో ... నువ్వు జాబ్ చెయ్యడానికి నే నంగీకరించలేను." అతని కంఠం అతనికే కొంచెం దురుసుగా వినిపించింది.

ఆశ్చర్యపోలేదు లత. అలా అని అతను జోక్ చేస్తున్నా డనుకునేటంతటి అమాయకురాలూ కా దామె. 'నేటి సమాజంలో స్త్రీ స్థానం', 'స్త్రీ పురోగతి' మొదలైన డిబేట్లలో అతను గెలుచుకున్న హర్షధ్వానాలూ, ప్రైజులూ జ్ఞాపకం చేసిం దామె.

అసందర్భమైన విషయాన్ని వింటున్నట్లు తల అడ్డంగా తిప్పా డతను. "చప్పట్లకోసం, ఒక విధంగా ప్రైజుల కోసం మాట్లాడిన విషయాలు వేరు, లతా. ప్రీచ్ చేసిన వన్నీ ఫాలో కావడానికి నేను మహాత్ముణ్ణి కాదు. మామూలు మనిషిని." నిష్కర్షగా అన్నా డతను.

రీజనింగ్‌కి దిగింది లత.

"చూడు, రాజా, నీ వెనక స్టేట్ ఆర్డరుపై ఉద్యోగం కొనసాగిస్తున్న తండ్రీ, పెళ్లి కెదిగిన చెల్లీ ఉన్నారని, నీ ముందు నువ్వొక్కడివే మొయ్యలేని 'కాస్ట్ ఆఫ్ లివింగ్' ఉందనీ జ్ఞాపకం చెయ్యక్కరలే దనుకుంటా?" అం దామె.

ఆ ట్టే అరిపాదంలో దిగబడినట్లు మొహం పెట్టిన రాజా మొహంలో ఎరుపు అస్తమిస్తున్న సూర్యుడి ఎరుపు కన్నా తక్కువగానే ఉంది.

"దట్స్ డిఫరెంట్, లతా. నువ్వు ... నువ్వు కాక నా భార్యగా నా జీవితంలో ప్రవేశించిన వ్యక్తి ఎవ్వరైనా డబ్బుకోసం పదిమందిలోకి వెళ్ళడం సహించలేను" అన్నాడు.

"నేను ఇంపాలా కార్లలో తిరగడం మానెయ్యగలను... నేత చీరలు కట్టుకుని బ్రతగ్గలను. ఇంకా చాలా చాలా మానెయ్యగలను, చెయ్యగలను — త్యాగం అనుకోకుండా. కాని, కాని ... నేను చదువుతున్న చదువుకి సార్థకత ఏమిటి?" అంది లత.

"నువ్వే కాలేజీలోనో చేరి పాఠాలు చెప్పకపోతేను, ఏ ఆఫీసు యంత్రాంగంలోనో ఓ మరమేకుగా మారకపోతేనూ జాతి పురోభివృద్ధి స్తంభించిపోతుం దంటావా?"

రాజా మాటల్లో శ్లేష స్పోర్టివ్‌గా తీసుకోలేకపోయిం దామె.

"నువ్వు తెచ్చే చాలీచాలని జీతంతో, తీరని స్వల్పమైన కోర్కెలతో, నాలుగ్గోడల మధ్య మూలగవలసిందేనన్న మాట నీ కాబోయే శ్రీమతి?"

ఆమె మాటల్లో వ్యంగ్యం గ్రహించా డతను.

"అలిసిపోయి ఇంటికి చేరిన నాకు చిరునవ్వుల ఫలహారం పెడుతూ, ముద్దులొలికే పిల్లలకు హోమ్‌వర్కులో హెల్ప్ చేస్తూ నా భార్య ఉండాలనుకోవడం తప్పంటావా?" నవ్వుల్లోకి దించబోయా డామెను.

శరీరాలు దగ్గరగానే ఉన్నా, మాటలు పెరుగుతున్నకొద్దీ, మనసుల్లోని ఆలోచనలు, దూరంగా పరుగెడుతున్నాయని గ్రహించా రిరువురూ.

ఆ తరవాత ఆ టాపిక్ మార్చటానికి వెన్నెల తెల్లగా ఉందనీ, గాలి చల్లగా ఉందనీ, విశాఖపట్నం రేపిడ్‌గా డెవలప్ అవుతూందనీ ఇద్దరికీ ఇంటరెస్ట్ లేని విషయాలు మాట్లాడుకున్నారు.

"నీ అభిప్రాయాల్ని ఫ్రాంక్‌గా చెప్పినందుకు థాంక్స్, రాజా. ఇద్దరం చదువుకున్నవాళ్లం. వైరివాళ్లలా ప్రవర్తించలేం కదా? మనమధ్య కాంప్లెక్సెస్ ఈ విషయంలో వద్దు." కొండ దిగుతూ లత అన్న మాటల్ని విన్నా డతను.

వెన్నెల జాలులో లత మొహంలోని భావాలను చదవడానికి వృథా ప్రయత్నం చెయ్యలే దతను.

ఆ సాయంత్రం . . .

క్వాలిటీ రెస్టారెంట్‌లో లతకోసం ఎదురుచూస్తున్న రాజా చెవుల్లో ఆ నాటి సంభాషణ టేప్ రికార్డర్ పెట్టి వినిపించిన ట్లనిపించింది.

ఏమైంది ఆ తరవాత?

ఈ మాట అతని కళ్లముందు అనుభవాల ఫిల్ము రీలు తిరిగింది.

అయిదు వేల కట్నంతో అపరంజి బొమ్మలాంటి రాధ అతణ్ణి వరించింది. రికమెండేషన్లు, రిజర్వేషన్లు పోను, అతను వరించాలనుకోని ఓ సాదా ఉద్యోగం అతణ్ణే వరించింది.

పి. యు. సి. పాసయినా, అక్షరాలు రాని పసిపిల్లలా తన మాటే వింటూ, తెచ్చింది రుచిగా ఉడకెయ్యడం, భగవంతు డిచ్చిన పిల్లల్ని మహాప్రసాదంగా స్వీకరించడమే డ్యూటీలుగాగల రాధ తన విధుల్ని రెగ్యులర్‌గా చేసుకుపోతుంటే, నలభై రూపాయల పెన్షన్‌తో మిగిలిపోయిన మాజీ మ్యునిసిపాలిటీ టీచరు నాన్న, అస్థిపంజరం లాంటి అమ్మ, తన పెరట్లో ముద్దబంతి అనుకున్న చెల్లి తన కళ్లముందు నిప్పుల బంతిలా తిరుగాడుతూంటే ...

కనిపించింది — అడ్వర్టైజ్‌మెంటు. మంచి పే. ఫ్రింజ్ బెనిఫిట్స్. ఉన్న ఊళ్లో ... ప్రైవేటు కంపెనీ. అయితేనేం? తనకి క్వాలిఫికేషన్స్ ఉన్నాయి. మరి రికమెండేషన్? ఆ కంపెనీ మేనేజింగ్ డైరెక్టరు లత తండ్రేనని తెలుసతనికి. తనెవరో అతను మరిచిపోయే ఉంటాడు. గుర్తించినా, లతని రొంపిలోకి లాగనందుకు 'రివార్డ్' చెయ్యడా?

ఏమైతేనేం? అప్లై చేశాడు. ప్రాంప్ట్‌గా ఇంటర్వ్యూ కాల్ వచ్చింది.

ఆఫీసులో అడుగు పెట్టగానే గ్రహించాడు ఇంటర్వ్యూ కండక్ట్ చేసేది లతే నని. వ్రాసిన ఉత్తరాలకైనా జవాబివ్వనందుకు ఇన్సల్ట్ చేస్తుందా? నో, నో. ఈ దేశంలో ఆడది దయ, క్షమ, ప్రేమ వగైరాలకు ప్రతిరూపం కాదూ?

'నిజమే, అవును' అంది అతని చేతిలో ఉత్తరం.

ఆలోచనల్లో ఉన్న రాజా ఎదురుగా వచ్చి కూర్చున్న లతని గుర్తించకపోవడంలో ఆశ్చర్యం లేదు.

"ఎలా ఉన్నారు?" మామూలుగా అడిగింది లత.

"చూస్తున్నావుగా?" అనడానికి ధైర్యం చాలలేదు రాజాకి.

బేరర్ తెచ్చిన ఐస్‌క్రీమ్ అతని ముందుకు జరుపుతూ, "మీ కీ జాబ్ వచ్చే అవకాశం లేదని చెప్పడానికి ..." అంది లత.

"మీరేం వివరించక్కరలేదు. నేనూ ఆ సమాధానమే ఎక్స్‌పెక్ట్ చేస్తున్నా" అన్నా డతను.

అతని మాటల్లోని వెనుకుని గమనించిన లత— "ఎప్పటి నుంచీ? నన్ను ఇంటర్వ్యూ బోర్డులో చూసినప్పటి నుంచీ కాదూ?" అంది.

"నో" అని అనలేదతను.

"నిజమే. మీకన్నా క్వాలిఫైడ్ వచ్చారు. ప్రిన్సిపిల్స్, ఫెయిర్ ప్లే మాట అటుంచి, మీ పట్ల పార్షియాలిటీ చూపటం కొత్తగా ఓపెన్ చెయ్యబోయే మా బ్రాంచిలో బిజినెస్‌కి మంచిది కాదు. యు సీ, బిజినెస్ ఫస్ట్" అంది.

అవమానంతో వివర్ణం కాలే దతని మొహం.

"ఈ సంగతి చెప్పడానికే మీరు శ్రమ తీసుకుంటే థాంక్స్" అన్నాడు.

నవ్వింది లత, అతని అభిమానానికి.

"మీ సంగతి ఎప్పటికప్పుడు కాకపోయినా, తెలుస్తూనే ఉంది. ఈ స్థితిలో మీ కొక సహాయం మాత్రం చెయ్యగలను."

ఒక్క క్షణం ఆగింది లత. ఊపిరి తీసుకోవటానికి కాదు, నోట్లో కరుగుతున్న ఐస్‌క్రీమ్ గొంతులోకి దిగటానికి.

"మా కొత్త బ్రాంచిలో క్లెరికల్ పోస్ట్సు ఉన్నాయి. మీ మిసెస్ చేత అప్లై చేయించండి ..." లత మాట పూర్తి చెయ్యలేదు.

తను కూర్చున్న కుర్చీ కుర్చీలా కాక, ముళ్ల కంచెలా అనిపించింది అతనికి. విసురుగా లేస్తూ, "చూడండి, లతాదేవీ. నేను మీ దయా దాక్షిణ్యాల మీద ఆధారపడి లేను. పడబోను, పడలేను" అన్నాడు.

"ప్లీజ్ సిట్‌డౌన్, రాజా! నే చెప్పింది అర్థంచేసుకోండి. మీ మీద మీరు మొయ్యలేని భారం ఉంది. అది మీ జీవిత భాగస్వామితో పంచుకోవడం తప్పు కాదు. మీ మగతనానికి లోపం కాదు. మారుతున్న కాలంతోపాటు మనుషులూ మారాలి. మారమని భీష్మించుకుని కూర్చున్న వాళ్లూ, పైకి ఉపన్యాసాలు చెబుతూ, లోపల ఉడుక్కునే వాళ్లూ, అభిమానం, ఆత్మగౌరవం అనే పంచదార పూత పూసి, కష్టాల విషగుళికలు దిగమింగే వాళ్లూ, సుఖపడలేరు కదా— తమ చుట్టూ ఉన్న వాళ్లనీ, తమతో అనుబంధం పెంచుకున్న వాళ్లనీ కూడా సుఖపడనివ్వరు. మీరూ ఆ ఎదిక్షీ ఎదగని మనుష్యుల కోవలోంచి ఇప్పుడైనా బయటపడితే నేనుకాదు, నా కన్నా ఎక్కువగా మీ భార్య సంతోషిస్తుంది. పిల్లలు సుఖపడతారు. ఆవిడచేత అప్లై చేయించండి. మీ ఇద్దరి శాలరీ మీకు ఈ కొత్త పోస్టులో వచ్చే జీతం కన్నా ఎక్కువే అవుతుంది. థిం కె వైల్..."

ఈ మాటు లత నిజంగా ఊపిరి తీసుకోవడానికి ఆగింది. కాకపోయినా, ఇంక ఆవిడ చెప్పవలసిన విషయాలేమీ లేవు.

రాజు హృదయంలో ఆత్మాభిమానానికి, అవసరానికి మధ్య సంఘర్షణ మొదలయింది. ఆ ఛాయలు అతని మొహం మీద గుర్తించిన లత మొహంలో వెన్నెల జల్లు లాంటి నవ్వు కురిసింది.

"ఏడు గంటలకి ఓ మీటింగుంది. సీ యూ, బెస్టాఫ్ లక్" అంటూ ఆమె వెళ్లిపోవడం గుర్తించా డతను.

ఆమెను ఆపే శక్తి అతనికి లేదు.

ఎదురుగా హాలు అయిన జీవితంలా, రంగుల భవిష్యత్తులా ఉన్న ఐస్‌క్రీమ్ తినడమా? వదిలిపెట్టి వెళ్లిపోవడమా? అనే విషయాన్ని తేల్చుకోలేకపోతున్నా డతను. *



పురాతన శిల్పం

ఫోటో—ఎస్. హెచ్. కృష్ణ (మద్రాసు-24)